## బ్యాక్‌లాగ్స్ రాసేందుకు వన్‌టైమ్ ఛాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిన విద్యార్థులకు వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థులకు ఈ అవకాశం కల్పించినట్లే పేర్కొన్నారు. అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10లోగా, రూ. 300 అపరాధ రుసుముతో 12 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతోపాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని, ఇతర వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

### ఎంఈ, ఎంటెక్ రీవాల్యుయేషన్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లే పేర్కొన్నారు. ఫలితాలను www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

### రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షల ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) అన్ని సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్, పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవచ్చని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 29 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

## అనుమానాస్పదంగా యువకుడి మృతి

సైదాబాద్, జూన్ 22: సైదాబాద్ లక్ష్మినగర్ కాలనీ పార్క్ సమీపంలో అనుమానాస్పదంగా యువకుడు(40) మృతిచెందిన ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఫారుఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన సంగమూల శ్రీకాంత్ (40) రైతు. శుక్రవారం రాత్రి సైదాబాద్ ఇంద్రప్రస్థ కాలనీలో నివసిస్తున్న సోదరి వద్దకు వచ్చాడు. అనంతరం గౌలిగూడలో ఉన్న ఓ వైన్ షాపులో మద్యం సేవించాడు. మద్యం మత్తులోనే సైదాబాద్‌కు తన సోదరి ఇంటికి ఆటోలో వచ్చాడు. ఇంటి అడ్రస్ చాల వరకు గుర్తించకపోవటంతో అనేక కాలనీల్లో తిరిగినప్పటికీ గుర్తించకపోవటంతో ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న అతడిని పార్క్ సమీపంలో వదిలేసి వెళ్లిపోయాడు. మద్యం సేవించటంతోపాటు, చికెన్ ముక్కలు నోట్లో ఇరుక్కోవటంతో దాహంతో మరణించినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. శనివారం ఉదయం మార్నింగ్ వాకింగ్ వచ్చిన వాకర్స్ యువకుడు కాలనీ పార్క్ వద్ద అనుమానాస్పదంగా మృతిచెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని సైదాబాద్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

# గుడిసె బాధితులకు న్యాయం జరిగేలా చూస్తా



గుడిసెల బాధితులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, జూన్ 22: నేషనల్ హైవే పనుల్లో భాగంగా హయత్‌నగర్ ప్రధాన రహదారి రేడియో స్టేషన్ ఎదుట కొన్ని సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న బాధితులకు తగిన విధంగా న్యాయం జరిగేలా చూస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీనిచ్చారు. శనివారం హయత్‌నగర్‌లోని రేడియో స్టేషన్ ఎదుట నేషనల్ హైవేలో గుడిసెలు కోల్పోతున్న బాధితుల వినతి మేరకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ గణపతిరెడ్డితో ఎమ్మెల్యే ఫోన్‌లో చర్చించి గతంలో గుడిసెల నివాసితులకు మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామని, దాదాపు 75 కుటుంబాలు ఇక్కడే నివాసముంటున్నాయని వివరించారు. రాబోయే వినాయక చవితికి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నందున గుడిసెలు కూలగొట్టి వారి జీవనోపాధి మీద దెబ్బకొట్టొద్దని కోరారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసానిచ్చారు. దీనికి గుడిసెలు కూల్చకుండా మరో రెండు నెలలు గడువు ఇచ్చేందుకు అధికారులు అనుమతులిచ్చారని తెలిపారు. ఆయన వెంటా మాజీ కార్పొరేటర్లు సామ తిరుమలరెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి యానాల కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు గుడాల మల్లేష్ ముదిరాజ్, నాయకులు నక్క రవీందర్‌గౌడ్, భాస్కర్ సాగర్, సింగిరెడ్డి మల్లీశ్వరి, గుడాల సందీప్, చంద్రారెడ్డి, స్కైలాబ్, ఇంద్రకరణ్‌రెడ్డి, మధు, తదితరులు ఉన్నారు.




## ఉత్తమ విద్యార్థులకు సన్మానం

సైదాబాద్, జూన్ 22 : పదో తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను సరస్వతీనగర్ శిశు మందిరంలో శనివారం అందజేశారు. సరస్వతీ విద్యా పీఠం తెలంగాణ ప్రాంత కార్యదర్శి పతకమూరి శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వస్వతీ శిశు మందిరంలో చదువుకున్న విద్యార్థులు అనేక మంది ఉన్నత స్థాయిలో ఉన్నారని, అదే విధంగా ఇక్కడ చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి ప్రముఖులు విద్యాన్‌రెడ్డి, సూర్యనారాయణ, రవీంద్రశర్మ, రంగారెడ్డి, దశరథ్ రెడ్డి, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పది వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానిస్తున్న నిర్వాహకులు

## సేవాలాల్ సేన రాష్ట్ర కో-కన్వీనర్‌గా గోవర్ధన్ నాయక్

కందుకూరు, జూన్ 22: సాయిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ ఇస్లావత్ గోవర్ధన్ నాయక్ సేవాలాల్ సేన రాష్ట్ర కో-కన్వీనర్‌గా ఎంపికయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవనాయక్, రాష్ట్ర కన్వీనర్ సైదానాయక్, భుక్యానాయక్ శనివారం నియామకపత్రాన్ని అందజేశారు.

## పాఠశాలలో నీరు నిలువకుండా చర్యలు

బడంగ్‌పేట, జూన్ 22: నాదర్‌గుల్ జడ్పీహెచ్‌ఎస్ స్కూల్, కుర్మల్‌గూడ జెఎన్‌ఎన్‌యూఆర్‌ఎంలో ప్రాథమిక పాఠశాల ఏర్పాట్లను విద్యాధికారి కృష్ణయ్య, కమిషనర్ రఘుకుమార్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నాదర్‌గుల్ జడ్పీహెచ్‌ఎస్‌లో వర్షం నీరు నిలువడంతో వరద నీరు పోవడానికి ఏర్పాట్లు చేశారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. కుర్మల్‌గూడలో జెన్‌ఎన్‌యూఆర్‌ఎంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. అవసరమైన సామగ్రి ఏర్పాటుపై చర్చించారు. త్వరలో స్కూల్ ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## చైన్ స్నాచర్ అరెస్ట్..

మలక్‌పేట, జూన్ 22 : చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి.. తప్పించుకు తిరుగుతున్న స్నాచర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని..మలక్‌పేట పోలీసులకు అప్పగించారు.. పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన సాయికుమార్ ప్రైవేట్ ఉద్యోగి. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య అనారోగ్యం బారినపడటంతో అప్పులపాలై చైన్ స్నాచింగ్‌లు చేయడం ప్రారంభించాడు. ఒంటరిగా వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకొని స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 18న రాత్రి విజయమ్మ అనే మహిళ మలక్‌పేట సూపర్‌బజార్ నుంచి ముంతాజ్ కళాశాలవైపు నడుచుకుంటూ వెళ్తుండగా, స్కూటీపై వచ్చిన నిందితుడు విజయమ్మ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం దిల్‌సుఖ్‌నగర్ శ్రీనగర్ కాలనీలో స్కూటీపై ఆగి ఉండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం ఒప్పుకోగా.. నిందితుడిని మలక్‌పేట పోలీసులకు అప్పగించగా అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి సొత్తును స్వాధీనం చేసుకున్నారు.







# నిర్లక్ష్యం ప్రమాదకరం

మన్సూరాబాద్, జూన్ 22: రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆటోనగర్‌లోని శ్రీనివాస ట్రావెల్స్ అండ్ టూర్స్ గ్యారేజీలో డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాచకొండ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ వి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. రోడ్లపై వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. అతి వేగంతో నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. వాహనాలను క్రమశిక్షణతో నడుపుతూ ప్రజల ప్రాణాలను రక్షించడమే డ్రైవర్ల బాధ్యత అన్నారు. ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రైవర్ తన మానసిక స్థితి, ఫిజికల్ ఫిట్‌నెస్ బాగుంటేనే విధులను సక్రమంగా నిర్వహించగలుగుతాడని తెలిపారు. ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి హాజరైన డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. రోడ్డు భద్రత ప్రమాణాలు పాటిస్తూ విధిగా సీటు బెల్లును పెట్టుకుని నిర్లక్ష్య దోరణిని వదలి జాగ్రత్తగా వాహనాన్ని నడుపుతామని మనస్సాక్షిగా డ్రైవర్లు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రాహీంపట్నం మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అనూష, శ్రీనివాస ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోటి శ్రీనివాసరావు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ కోఆర్డినేటర్ సావిత్రి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్, టీసీఎస్ శివ తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమానికి హాజరై డ్రైవర్లతో ప్రమాణం చేయిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ డీసీపీ వి.శ్రీనివాసులు తదితరులు

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం, జూన్ 22: సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. చైతన్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకుల ఆహ్వానం మేరకు శనివారం కాలనీలో పర్యటించారు. రహదారుల పక్కన అపరిశుభ్రతను గుర్తించి అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, సంజీవ రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, ఈ.నరేందర్ తేజ, జలమండలి మేనేజర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

చాదర్‌ఘాట్, జూన్ 22: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ఏక్తా జనశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేశ్ యాదవ్ అన్నారు. శనివారం వాణి స్కూల్ విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్ కుమార్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు డి.రామలక్ష్మి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

మన్సూరాబాద్, జూన్ 22: సహారాస్టేట్స్ కాలనీ పదో బ్లాక్ వద్ద తరచూ తలెత్తుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ఎగువ నుంచి వస్తున్న మురుగునీరు లీకై పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆయన శనివారం సదరు సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఆటోనగర్ డంపింగ్ యార్డు నుంచి వచ్చే మురుగునీటిని సహారాస్టేట్స్ కాలనీ ప్రాంతంలోని పైపులైన్ కలపడం వలన డ్రైనేజీ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం గతంలో రూ.6కోట్లు మంజూరైనప్పటికీ పనులు ఆగిపోయాయని.. వెంటనే జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూస్, ఎస్‌డబ్ల్యూ అధికారులు కలుగజేసుకుని నాలా కొనసాగింపు పనులు పునరుద్ధరించి సహారావాసుల ఇబ్బందులకు మోక్షం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సహారాస్టేట్స్ కాలనీ మెయింటెనెన్స్ కమిటీ అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

### నిధులు మంజూరైన పనులు చేపట్టాలి

ఆర్కేపురం, జూన్ 22: సరూర్‌నగర్ డివిజన్‌లో మంజూరైన రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, వరదనీటి నాలా పనులను వెంటనే చేపట్టాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ శనివారం జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతిపత్రం అందజేశారు.

## బాలికలకు భరోసా.. సుకన్య సమృద్ధి యోజన ఖాతా

- వందమంది బాలికలకు ఖాతాలను తెరిచిన యూపీఎస్సీ ర్యాంకర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: బాలికల భవిష్యత్‌కు సుకన్య సమృద్ధి యోజన పథకం భరోసా ఇస్తున్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. పేద బాలికలకు చేయూతనందించేందుకు భారత తపాలాశాఖ 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని చేపట్టింది. శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని జామై ఉస్మానియా పోస్టాఫీస్‌లో పోస్ట్ మాస్టర్ జనరల్ టీఎం శ్రీలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో 64 మంది యూపీఎస్సీ-24 ర్యాంకర్లు పాల్గొని వంద మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజక ఖాతాలు తెరిచి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేశారు.

ఐఆర్‌ఎస్ అధికారులు నరసింహారెడ్డి, అనురాగ్‌సింగ్, ఐఆర్‌ఏఎస్ అధికారి రాంరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై సుకన్య ఖాతాలతోపాటు బాలికల తల్లిదండ్రులు, సంరక్షకులకు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ డిజిటల్ అకౌంట్లనూ తెరిచారు. ఈ సందర్భంగా పోస్ట్‌మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజనా ఖాతాలను కేంద్ర ప్రభుత్వం 2015లో భేటీ బచావో, భేటీ పడావో నినాదంలో భాగంగా బాలికల భవిష్యత్ కోసం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 3,89, 24,105 ఖాతాలను తెరిచారని వివరించారు. అందులో కేవలం పోస్టాఫీసల ద్వారానే 3,24,66,947 ఖాతాలు తెరిచారని, రాష్ట్రంలో 10,54,062 ఖాతాలు తెరిచారని చెప్పారు. ఈ పథకంతో దేశంలో చాలా వరకు భ్రూణ హత్యలు తగ్గాయని పేర్కొన్నారు. ఎంతోమంది యువతులు వారి పెళ్లిళ్లు, చదువులకు సకాలంలో డబ్బును ఉపయోగించుకున్నారని తెలిపారు. ప్రతి ఆడపిల్ల ఆర్థిక స్వావలంబనకు ఈ పథకం ఉపకరిస్తుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో భారత తపాలాశాఖ అధికారులు పాల్గొన్నారు.



జామై ఉస్మానియా పోస్టాఫీసు వద్ద సుకన్య సమృద్ధి ఖాతా పుస్తకాలతో బాలికలు, వారి తల్లిదండ్రులు, యూపీఎస్సీ ర్యాంకర్లు, భారతీయ తపాలాశాఖ అధికారులు

